సాక్షి

వైఎస్‌ఆర్ జిల్లా

మంగళవారం । 17 । సెప్టెంబర్ । 2024



మేము పెద్దాయన మనుషులం

ప్రొద్దుటూరు మండల పరిధిలోని రామాపురం గ్రామం వద్ద ఉన్న పెన్నానది నది నుంచి ఇసుక అక్రమ రవాణా చేస్తున్న విషయం పోలీసుల దృష్టికి వచ్చింది. - 8లో



రోడ్డు రిపేరులో ఉన్నా టోల్ వసూల్

కేంద్ర ప్రభుత్వం చెప్పేది ఒకటి ఆచరించేది మరొకటిగా కన్పిస్తోంది. రోడ్డు రిపేరులో ఉన్నా టోల్ వసూలు చేస్తుండంతో వాహనదారులు విస్మయం చెందుతున్నారు. - 8లో

గరిష్టం/కనిష్టం
35.0 /27.0

వాతావరణం

జిల్లాలో శనివారం 27.0 – 35.0 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 2.95 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

– కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

ఉచిత శిక్షణ



సమావేశంలో మాట్లాడుతున్న జీసీడీఓ విజయలక్ష్మి

పులివెందుల రూరల్ : పులివెందుల పట్టణం లోని నేషనల్ అకాడమి ఆఫ్ కన్‌స్ట్రక్షన్స్, నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ సౌజన్యంతో ఎలక్ట్రానిక్స్ సెక్టార్, స్కిల్ కౌన్సిల్ ద్వారా సమగ్ర శిక్ష అభియాన్‌లో వృత్తి విద్యా శిక్షకులకు, ఫీల్డ్ టెక్నిషియన్లు, హోం అప్లియన్సెస్ ద్వారా శిక్షణ ఇస్తున్నట్లు న్యాక్ డైరెక్టర్ రాకేష్ తెలిపారు. ఈ శిక్షణకు ముఖ్య అతిథులుగా జీసీడీవో విజయలక్ష్మి, ఎంఈఓ ఎస్.రావులు హాజరై మాట్లాడారు. శిక్షణ కార్యక్రమాన్ని సుమారు 10రోజులపాటు నిర్వహించనున్నట్లు వివరించారు. వృత్తి విద్యా నైపుణ్యాలను పెంపొందించడానికి శిక్షణ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. మాస్టర్ ట్రైనర్లు శ్యాం ప్రసాద్, నాగేంద్ర కుమార్, అహుజ తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఎస్‌యూ జాతీయ అధ్యక్షుడి ఎంపిక

వైవీయూ : రెవల్యూషనరీ విద్యార్థి సంఘం (ఆర్ఎస్‌యూ) జాతీయ అధ్యక్షుడిగా కడపకు చెందిన వి. రవిశంకర్‌రెడ్డి ఎన్నికయ్యాడు. తిరుపతి వేదికగా నిర్వహించిన ఆర్ఎస్‌యూ ప్రథమ జాతీయమహాసభల్లో జాతీయ అధ్యక్షుడిని ఎన్నుకున్నట్లు రవిశంకర్‌రెడ్డి తెలిపారు. దేశవ్యాప్తంగా ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం పోరాడుతామని తెలిపారు.

నేడు నీటి విడుదల

బ్రహ్మంగారిమఠం : తెలుగు గంగలో అంతర్భాగమైన బ్రహ్మంసాగర్ నుంచి మంగళవారం ఉదయం 10గంటలకు కుడి,ఎడమ కాలువలకు బద్వేల్ ఎమ్మెల్యే డాక్టర్ సుధా,మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ చేతులమీదుగా నీరు విడుదలచేయనున్నట్లు ఇన్‌చార్జ్ ఎస్ఈ వెంకటరామయ్య ఒక ప్రకటనలో తెలిపారు. రెండు కాలువల కింద రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని సాగర్‌లోకి నీరు వస్తుండడంతో నీటి విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

వైభవం..పల్లకీ ఉత్సవం



పల్లకీలో కొలువుదీరిన శ్రీ భద్రకాళీ సమేతుడు

రాయచోటి టౌన్ : రాయచోటి శ్రీ భద్రకాళీ సమేతుడు పల్లకీలో ఊరేగారు. సోమవారం రాత్రి మూల విరాట్‌లకు ప్రధాన అర్చకులు కృష్ణయ్య స్వామి, శంకరయ్య స్వామి, శేఖర్ స్వామి, మల్లికార్జున స్వామి, వేదపండితులు రాచరాయ యోగీ స్వామి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్లను పూలు, పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలతో అందంగా అలంకరించి పల్లకీలో కొలువుదీర్చారు. ఆలయ మాఢవీధుల్లో, ఆలయ ప్రాంగణంలో ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో డీవీ రమణారెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

ఇసుక టోకెన్‌ల కోసం జాగారం



సోమవారం రాత్రి ఇసుక టోకెన్‌ల కోసం సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద క్యూలో ప్రజలు

రాజంపేట టౌన్ : ఇసుక కోసం ప్రజలు పడుతున్న ఇబ్బందులు వర్ణణాతీతంగా ఉన్నాయి. ఇళ్లు త్వరగా నిర్మించుకోవాలని కొందరు, ఇసుక టోకెన్ దొరికితే జానెడు పొట్టను నింపుకోవచ్చని ట్రాక్టర్ డ్రైవర్లు ఆరాటపడుతున్నారు. అందుకోసం ఇటు భవన నిర్మాణ యజమానులు అలాగే ట్రాక్టర్ డ్రైవర్లు ఇసుక టోకెన్ల కోసం ముందు రోజు రాత్రి నుంచే సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్దకు వచ్చి క్యూలో నిలుచొని తెల్లవార్లు జాగరణ చేస్తున్నారు. ఈనెల 15వ తేదీ ఆదివారం, 16 మిలాద్ ఉన్ నబీ కారణంగా సెలవు కావడంతో ఇసుక టోకెన్లు ఇవ్వలేదు. రెండు రోజులు ఇసుక సరఫరా లేక పోవడంతో సోమవారం రాత్రి 9 గంటలకే చాలా మంది సబ్ కలెక్టర్ కార్యాలయం వద్దకు వచ్చి వరుస క్రమంలో ఉన్నారు. వీరంతా రాత్రి అక్కడే పడుకోనున్నట్లు తెలిపారు. వీరిలో 29 మంది ట్రాక్టర్‌కు, 40 మంది టిప్పర్‌కు సంబంధించిన వారు ఉన్నారు. అయితే రోజుకు 40 ట్రాక్టర్లకు, 40 టిప్పర్లకు మాత్రమే అధికారులు టోకెన్లు ఇస్తున్నారు. ఇదిలావుంటే సోమవారం రాత్రి నుంచి క్యూలో ఉన్న వారికి అధికారుల ఆదేశాల మేరకు మంగళవారం ఉదయం టోకెన్లు ఇస్తారు. ఇసుక కోసం ప్రభుత్వం పెడుతున్న కష్టాలకు పలువురు దుమ్మెత్తిపోశారు.

మెరుగైన వైద్య సేవలు అందుతాయి



పులివెందులలో నిర్మించిన డాక్టర్ వైఎస్ఆర్ మెడికల్ కళాశాల అందుబాటులోకి తీసుకొస్తే మెరుగైన వైద్య సేవలు అందుతాయి. ఈ ప్రాంత ప్రజల ఆరోగ్య అవసరాల దృష్ట్యా గత ప్రభుత్వం కోట్లు వెచ్చించి మెడికల్ కళాశాల నిర్మించింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం అందుబాటులోకి తీసుకురాకుండా కక్ష సాధింపులకు పాల్పడడం అన్యాయం. విద్యార్థుల భవిష్యత్తు దృష్టిలో పెట్టుకొని ఈ మెడికల్ కళాశాలను అందుబాటులోకి తేవాలి.

– షేక్ మునీర్ బాషా, మైనార్టీ కన్వీనర్ వేంపల్లె.



మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ తగదు



రాష్ట్రంలో మెడికల్ కళాశాలలు ప్రైవేటీకరణ చేసేందుకు చంద్రబాబు ప్రభుత్వం ప్రయత్నించడం తగదు. ఆయన 14 ఏళ్లు సీఎం గా చేశారు. ఏనాడు కూడా వైద్య విధానాన్ని ప్రోత్సహించలేదు. మళ్లీ ఇప్పుడు మెడికల్ కళాశాలకు సీట్లు కేటాయించకపోవడం దారుణం. మెడికల్ కళాశాల సీట్లు పెరిగితే పేద విద్యార్థులకు చాలా ఉపయోగకరం. పేద ప్రజలకు నాణ్యమైన వైద్యం అందుతుంది.

– నారాయణరెడ్డి, చైతన్య కళాశాల ప్రిన్సిపల్, పులివెందుల

ఓటు సవరణ ముమ్మరం



ఓటరు జాబితాను పరిశీలిస్తున్న సిబ్బంది

వైఎస్సార్ జిల్లా వ్యాప్తంగా ఓటర్ల వివరాలు

నియోజకవర్గం	పురుష ఓటర్లు	మహిళా ఓటర్లు	ఇతరులు	మొత్తం
బద్వేలు	109163	110122	05	219290
కడప	138300	145153	90	283543
పులివెందుల	111727	117941	19	229687
కమలాపురం	99851	104284	34	204169
జమ్మలమడుగు	117746	124795	15	242556
ప్రొద్దుటూరు	119985	127933	48	247966
మైదుకూరు	104085	107765	05	211855
మొత్తం	800857	837993	216	1639066

- తప్పుల సవరణకు అవకాశం కల్పించిన ఎన్నికల కమిషన్
- అక్టోబరు 18 వరకు ఇంటింటి పరిశీలన పూర్తి చేయాలని లక్ష్యం
- 18 ఏళ్లు నిండిన వారి పేర్ల నమోదుకు అవకాశం

కడప కోటిరెడ్డిసర్కిల్: ఎన్నికల సంఘం ఓటరు నమోదు కార్యక్రమాన్ని విస్తృతంగా చేపట్టింది. నూతన ఓటర్ల నమోదుతో పాటు ఇప్పటికే నమోదైన వారి పేర్లు, చిరునామా, సవరణలకు శ్రీకారం చుట్టింది. తద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేందుకు కసరత్తు ప్రారంభించింది. ఆ దిశగా యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపడుతోంది. ఓటరు నమోదుకు ప్రీ రివిజన్ పేరిట ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఈ ఏడాది సంక్షిప్త ఓటరు జాబితా సవరణలను ప్రారంభించింది. ప్రస్తుతం బూత్ స్థాయి అధికారులు ఈ ప్రక్రియను కొనసాగిస్తున్నారు.

ఓటర్ల సవరణలు

మే నెలలో జరిగిన సార్వత్రిక ఎన్నికలకు వారం రోజుల ముందుగా ఎన్నికల సంఘం ఓటరు తుది జాబితాను వెలువరించింది. వివిధ కారణాలతో అప్పట్లో కొందరు ఓటుహక్కుకు అర్హులైనా నమోదుకు దూరమయ్యారు. మరికొందరు నిర్లక్ష్యం ప్రదర్శించడం, సకాలంలో స్పందించకపోవడంతో ఓటు నమోదు చేసుకోలేకపోయారు. ఫలితంగా సార్వత్రిక ఎన్నికల్లో ఓటుహక్కుకు దూరమయ్యారు. అలాంటి వారికి ఎన్నికల సంఘం ఏటా ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా అర్హులను చేర్చడం, అనర్హులను తొలగించే ప్రక్రియ చేపడుతోంది. ఎప్పటిలాగా ఈ ఏడాది సైతం బూత్ స్థాయి ఉద్యోగులు క్షేత్ర స్థాయిలో కార్యక్రమాన్ని చేపడుతున్నారు. గ్రామాల్లో పర్యటించి సర్వే నిర్వహిస్తున్నారు. ప్రతి ఇంటికి వెళ్లి ఓటరు జాబితాలో ఉన్న వివరాల ప్రకారం సర్వే నిర్వహిస్తున్నారు.

➡ కొత్తగా నమోదుకు అవకాశం

కొత్త ఓటర్ల నమోదుపై సైతం దృష్టి సారిస్తున్నారు. 2025 జనవరి 1వ తేదీ నాటికి 18 ఏళ్లు నిండే యువత ఎవరైనా ఉన్నారా? అని ఆరా తీస్తున్నారు. ఇప్పటికే 18 ఏళ్లు నిండి ఓటరుగా నమోదుకాని వారిని గుర్తిస్తున్నారు. ఒకవేళ ఉంటే వారి వివరాలు నమోదు చేసుకుంటున్నారు. అంతేకాకుండా గ్రామీణ ప్రాంతాల్లోని పోలింగ్ కేంద్రాల ప్రస్తుత పరిస్థితిని సమీక్షిస్తున్నారు.

అక్టోబరు 18 నాటికి పూర్తి

ఓటర్ల పోలింగ్ కేంద్రాల పరిశీలన, రాజకీయ పార్టీలతో చర్చించడం అక్టోబరు 18 నాటికి పూర్తి చేయాలన్న లక్ష్యంగా నిర్ణయించుకున్నారు. ప్రతి పోలింగ్‌బూత్‌లో ఓటర్ల సంఖ్య 1500కు మించకుండా ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. 29వ తేదీ ఓటర్ల ముసాయిదా జాబితాను విడుదల చేస్తారు. ఆరోజు నుంచి నవంబరు 28 వరకు అభ్యంతరాల స్వీకరణ...డిసెంబరు 24 నాటికి వాటి పరిష్కారం చేస్తారు. 2025 జనవరి 6న తుది ఓటరు జాబితాను ప్రకటించనున్నారు.

ప్రవక్త బోధనలు అనుసరణీయం





కడప నగరంలో మిలాద్ జులూస్‌లో పాల్గొన్న ముస్లిం ప్రముఖులు, గురువులు (ఇన్‌సెట్) రక్తదానం చేస్తున్న యువకులు

- మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా
- నగరంలో ఘనంగా మిలాదున్నబీ జులూస్

కడప కల్చరల్ : మహా ప్రవక్త బోధనలు ప్రపంచ మానవాళికంతటికీ అనుసరణీయమని, అందుకే ఆయన మార్గాన్ని అనుసరించాల్సిన అవసరం ఉందని మాజీ డిప్యూటీ సీఎం ఎస్‌బీ అంజద్‌బాషా తెలిపారు. మహా ప్రవక్త మహమ్మద్ జన్మదినం మీలాదున్ నబీ పర్వదినాన్ని పురస్కరించుకుని సోమవారం కడప నగరంలో ఆంధ్రప్రదేశ్ మర్కజీ మిలాద్ జులూస్ కమిటీ జిల్లాశాఖ ఆధ్వర్యంలో జులూస్ (ర్యాలీ) నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తూ అంజద్‌బాషా మాట్లాడుతూ అల్లాహ్ దూతగా భువిపైకి వచ్చిన ఆయన ప్రజలందరినీ సన్మార్గంలో నడవాలని సూచించారన్నారు. ఆయన మార్గం ఆదర్శనీయమని.. ఆయన బోధనలను అనుసరించాల్సిన అవసరం ఎంతైనా ఉందని అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా అందరికీ మిలాదున్నబీ శుభాకాంక్షలు తెలిపారు.

ఘనంగా ర్యాలీ

కడప నగరం అగాడిలోని ఇనాయత్‌ఖాన్ తాలీం మైదానం నుంచి మిలాదున్నబీ జులూస్ కమిటీ వ్యవస్థాపక అధ్యక్షులు హజరత్ ముఫ్తీ మహమ్మద్ అలీ బగ్దాదిసాహెబ్, స్థానిక ముస్లిం సంఘాలు, యువ సంఘాల ఆధ్వర్యంలో జులూస్ ప్రారంభమైంది. మట్టిపెద్దపులి వీది, చెన్నూరు బస్టాండు, గోకుల్ సర్కిల్, ఎస్ఎఫ్ఎస్ స్ట్రీట్, ఏడురోడ్ల కూడలి నుంచి ర్యాలీ పాత బస్టాండు మీదుగా గుంతబజారు మసీదు వద్దకు చేరుకున్నారు. ప్రవక్త గుణగణాలను ప్రస్తుతిస్తూ నాత్ గీతాలను వినిపిస్తుండగా ఆకుపచ్చ జెండాలను చేతబూని ప్రవక్త గురించి నినాదాలు చేస్తూ ముస్లింలు పెద్ద ఎత్తున ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మత గురువు హజరత్ వలీవుల్లా సాహెబ్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ర్యాలీ నిర్వహణకు సహకరించిన పోలీసులు, అధికారులు, ముస్లిం మత గురువులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర ముస్లిం ప్రముఖులు నజీర్ అహ్మద్, అమీర్‌బాబు, మహమ్మద్ అలీ, కార్పొరేటర్ షఫీతోపాటు గురువులు, నగర ప్రముఖులు, పెద్ద ఎత్తున ముస్లింలు పాల్గొన్నారు.

భక్తి, సేవ

ర్యాలీ అనంతరం గుంతబజారు మసీదులో ప్రవక్తను కీర్తిస్తూ నాత్ గీతాలను ఆలపించారు. ఈ సందర్భంగా కొందరు మత గురువులు ప్రవక్తలోని ఆదర్శవంతమైన గుణగణాలను ప్రస్తుతించారు. మరోవైపు అమీనియా, ఖాన్ కా రిస్తా తదితర సంస్థల ఆధ్వర్యంలో భారీగా రక్తదాన శిబిరం నిర్వహించారు.

జీవో 115ను రద్దు చేయాలి

- జీఎన్ఎమ్, బీఎస్సీ, ఎంఎస్సీ నర్సుల ధర్నా
- ధర్నాకు మద్దతు తెలిపిన ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి



ధర్నా చేస్తున్న నర్సులతో మాట్లాడుతున్న కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి

పులివెందుల రూరల్ : ప్రభుత్వం జీవో నెంబర్ 115 ను రద్దు చేయాలని, కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ స్టాఫ్ నర్సులను రెగ్యులర్ చేయాలని సోమవారం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ఎదుట నర్సులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీఎన్ఎం, బీఎస్సీ, ఎమ్మెస్సీ, పీహెచ్డీ వ్యవస్థను గుర్తించాలన్నారు. కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్, స్టాఫ్ నర్సులను రెగ్యులర్ చేయాలన్నారు. 15ఏళ్ల నుంచి నర్సులుగా చేస్తున్న తమను ప్రభుత్వం గుర్తించకుండా కొత్తగా వచ్చిన ఏఎన్ఎంలను గుర్తించి నర్సు పోస్టులు ఇవ్వడం చాలా బాధాకరమన్నారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి గతంలో ఉన్న వారిని రెగ్యులరైజేషన్ చేశారని.. అదేవిధంగా సీఎం చంద్రబాబు ఇప్పుడున్న వారిని రెగ్యులైరేజేషన్ చేయాలని డిమాండ్ చేశారు.

ప్రిన్సిపల్ సెక్రటరీతో మాట్లాడిన ఎంపీ

ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి వద్ద ధర్నా చేస్తున్న నర్సులకు కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారి డిమాండ్లను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రిన్సిపల్ సెక్రటరీ కృష్ణబాబుతో ఫోన్‌లో మాట్లాడి నర్సుల సమస్యలను ఆయనకు వివరించారు. అలాగే ఎన్జీవో అధ్యక్షుడు జగన్నాథ్ రెడ్డి నర్సుల ధర్నాకు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో నర్సులు శైలజ, హారిక, శిరీష, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన శ్రీరంగనాథస్వామి నూలు పూజ పవిత్రోత్సవాలు

పులివెందుల టౌన్ : పులివెందుల పట్టణంలోని శ్రీరంగనాథస్వామి ఆలయంలో వినాయక చవితి పండుగ మరుసటి రోజు నుంచి 9 రోజుల పాటు నూలు పూజ పవిత్రోత్సవాలు వైభవంగా నిర్వహించారు. అందులో భాగంగా సోమవారం సతీసమేత శ్రీరంగనాథ స్వామి హంస వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు కృష్ణ రాజేష్ శర్మ ఉభయదారులచే ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ రమణ, ఆలయ చైర్మన్ సుధీకర్‌రెడ్డి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



హంసవాహనంపై శ్రీరంగనాథస్వామి ఊరేగింపు

ఘనంగా మిలాద్ జెండా ఊరేగింపు

కమలాపురం : జష్నే మిలాద్–ఉన్–నబి జెండా ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. సోమవారం పీఠాధిపతి శ్రీ హజరత్ ఫైజుల్ గఫార్ షా ఖాద్రి ఆధ్వర్యంలో, దర్గా కన్వీనర్ షేక్ ఇస్మాయిల్ పర్యవేక్షణలో ఆస్థాన–ఏ–జహీరియా నుంచి దర్గా–ఏ–గఫారియా వరకు మిలాద్–ఉన్–నబి జెండా ఊరేగింపు అశేష భక్త జన సందోహం నడుమ భక్తి శ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. అనంతరం పెద్ద దర్గా ఆవరణలో మిలాద్ జెండాను పీఠాధిపతి ప్రతిష్ఠించారు. అనంతరం స్వాముల వారి మజార్లపై పూల చాదర్‌లు సమర్పించి, ప్రత్యేక ఫాతెహా చేశారు. పీఠాధిపతి సోదరులు దస్తగిరి స్వామి, మౌలానా స్వామి, గౌస్‌పాక్, జియా, ఇస్మాయిల్, సర్ఫ్‌రాజ్, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



కమలాపురం జెండా ఊరేగింపులో పాల్గొన్న పీఠాధిపతి, సోదరులు, భక్తులు

అలాగే కుమ్మరివీధిలో వెలసిన తాళిం, తూర్పు వీధిలో వెలసిన జెండా చెట్టు వద్ద ఆ కాలనీల యూత్ ఆధ్వర్యంలో భక్తి శ్రద్ధలతో మిలాద్ వేడుకలు నిర్వహించారు.

రాపూర్ ఘాట్ రోడ్డు!

- 18కిలోమీటర్లు..30 మలుపులు
- ఎదురెదురుగా వాహనాలువస్తే..
- భయం..భయంగా ప్రయాణం



రాజధానికి వెళ్లే రాపూరు ఘాట్‌రోడ్డు మలుపు వద్ద ఉన్న సింగల్‌రోడ్డు దుస్థితి

రాజంపేట : ఉభయజిల్లాల్లో రాజధానికి రాపూరు ఘాట్‌రోడ్డును రెండో రహదారిగా వినియోగించుకుంటున్నారు. అనంతపురం, కదిరి, రాయచోటి, రాజంపేట, రైల్వేకోడూరు ప్రాంతాలకు చెందిన వారు ఈ రోడ్డు మార్గంలో నెల్లూరు, కావలి, ఒంగోలు, విజయవాడ, బెజవాడ, కాకినాడ తదితర ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుంటారు. రాజంపేట–నెల్లూరు రహదారిలో చిట్వేలి–రాపూరు మధ్య ఉన్న పెనుశిల అభయారణ్యంలో 18 కిలోమీటర్ల మేర ఘాట్‌రోడ్డు ఉంది. దివంగత సీఎం వైఎస్సార్ హయాంలో ఘాట్‌రోడ్డు అభివృద్ధిపై దృష్టి పెట్టారు.ఆయన మరణాంతరం ఈ రోడ్డు అభివృద్ధి చేయ లేదు. ఈ రోడ్డులో 30 మలుపులు ఉన్నాయి.

ప్రమాదకర సంఘటనలకు తావిచ్చిన పరిస్థితులు అనేకం ఉన్నాయి. రాపూరు–చిట్వేలి మధ్య ఉన్న ఘాట్‌రోడ్డులో ఎదురెదురుగా వాహనాలు వస్తే అతి జాగ్రత్తగా ఉండకపోతే లోయలోకి పడాల్సి వస్తుంది. మలుపుల వద్ద పటిష్టమైన చర్యలు కనిపించవు.

రాష్ట్ర విభజనతో రద్దీగా ఘాట్‌రోడ్డు

రాష్ట్ర విభజన తర్వాత రాజధానికి వెళ్లేందుకు ఈ ఘాట్‌రోడ్డు అనుకూలమైనప్పటికీ ప్రమాదకర పరిస్థితిలో ప్రయాణం కొనసాగించాల్సిందే. అమరావతికి ఇప్పుడు ఈ రోడ్డు మార్గం మీదుగా వెళ్లే వారి సంఖ్య పెరిగింది. ఆర్టీసీ విజయవాడకు బస్సులను నడిపుతోంది. ఘాట్‌రోడ్డు సరిగ్గా లేకపోవడంతో ప్రైవేటు బస్సులు ఇంకా నడిపేందుకు యాజమాన్యాలు ముందుకు రావడం లేదు. రాపూరు నుంచి వచ్చేటప్పుడు ఘాట్‌రోడ్డు అధ్వానంగా తయారైంది. నెలూరు, అన్నమయ్య జిల్లా కలెక్టర్లు ఘాట్‌రోడ్డు అభివద్ధిపై దృష్టి సారించాలని ప్రయాణీకులు కోరుతున్నారు.

గతంలో జరిగిన ప్రమాదాలు..

రాపూరు ఘాట్ రోడ్డులో గత ప్రమాదాలను ఒక్కసారి పరిశీలిస్తే ఈ రోడ్డు ఎంత అధ్వానంగా ఉందో తెలిసిపోతుంది.

- 1983లో పెళ్లి బందం బస్సు బ్రేక్‌ఫెయిలై లోయలో పడి ఇద్దరు మృతి చెందారు.
- 2007 మే 5న ఐదుగురు మరణించారు.
- 2007లో వరదతాకిడికి కదిరి బస్సు చిక్కి ఆరుగురు చనిపోయారు.
- 2008 జూన్‌లో 3న వాకాడు బస్సు లోయలో పడి ముగ్గురు మృతి చెందారు
- 2008 సెప్టెంబరులో రైల్వేకోడూరు బస్సులో లోయలోపడి 14 మంది దుర్మరణం చెందారు
- 2008 అక్టోబరులో ఘాట్ మలుపులో లారీ, బస్సు, స్కూటర్ ఢీకొని భార్యభర్తలు మృతి చెందారు

రహదారిని విస్తరించాలి



రాజంపేట నుంచి విజయవాడ, నెలూరు ప్రాంతాలకు వెళ్లే రహదారిలో రాపూర్ ఘాట్‌రోడ్డును అభివృద్ధి చేయాలి. డబుల్‌రోడ్డుగా మార్చాల్సిన అవసరం ఎంతైనా ఉంది. పాలకులు ఈ రోడ్‌లో ప్రమాదనివారణ చర్యలు మరింత పటిష్ట పరచాలి. ఘాట్‌రోడ్డు అభివృద్ధి ఎన్‌హెచ్ తరహాలో ఉన్నప్పుడే జర్నీ సేఫ్టీగా ఉంటుంది.

– పాపినేని విశ్వనాథరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లానేత, రాజంపేట

ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి



రాపూరు ఘాట్‌రోడ్డు విస్తరణ చేపట్టాలి. రాపూరు నుంచి వచ్చేటప్పుడు ఘాట్ రోడ్డు అధ్వానంగా తయారైంది. సింగిల్‌రోడ్డు కావడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. డౌన్‌లో స్పీడ్ బ్రేకర్లు లేవు. ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి.

– దాసరి పెంచలయ్య, వైఎస్సార్‌సీపీ జిల్లాదళితనేత

‘గండికోట’కి తగ్గిన ఇన్‌ఫ్లో

కొండాపురం : గండికోట జలాశయంలోకి కృష్ణా జలాల ప్రవాహం తగ్గింది. ఇదివరకు ఆవుకు రిజర్వాయర్ నుంచి గాలేరు నగరి సృజలస్రవంతి ప్రధాన కాలువ ద్వారా 10 వేల క్యూసెక్కుల వచ్చేవి. సోమవారం మధ్యాహ్నం 2గంటల నుంచి 5 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో తగ్గినట్లు జీఎన్ ఎస్ఎస్ డీఈ ఉమమహేశ్వర్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గండికోట జలాశయం నీటి పూర్తిసామర్థ్యం 26.85 టీఎంసీలు కాగా ప్రస్తుతం 25.6 టీఎంసీలు నీటినిల్వ ఉందన్నారు. గండికోట నుంచి మైలవరం జలాశయానికి ప్రస్తుతం ఉన్న 7500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లోని రాత్రినుంచి 5 వేల క్యూసెక్కులకు తగ్గిస్తున్నామని ఆయన వెల్లడించారు. అలాగే గండికోట ఎత్తిపోతల పథకం నుంచి మూడు మోటర్ల ద్వారా 1500 క్యూసెక్కుల నీరు చిత్రావతి బ్యాలెన్స్ రిజర్వాయర్‌కు పంపింగ్ చేస్తున్నామని వివరించారు. జీకేఎల్ఐ నుంచి ఏడు మోటర్ల ద్వారా 770 క్యూసెక్కుల నీరు పైడిపాళెం జలాశయానికి పంపింగ్ చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. గండికోట ప్రాజెక్టు నుంచి గాలేరి నగరి సృజల స్రవంతి ప్రధాన కాలువ నుంచి శెట్టివారి పల్లె మెయిన్ హెడ్ రెగ్యులేటర్ గేటు ద్వారా వామికొండ, సర్వరాయసాగర్ జలాశయాలకు 700 క్యూసెక్కుల నీరు కొనసాగుతున్నట్లు ఆయన తెలిపారు.

కేంద్రానికి లేఖ రాయడం కుట్రలో భాగమే



రాష్ట్రంలోని మెడికల్ కళాశాలలకు సీట్లు వద్దంటూ కేంద్రానికి లేఖ రాయడం కూటమి ప్రభుత్వం కుట్రలో భాగమే. మెడికల్ కళాశాలలకు సీట్లు కేటాయిస్తే పేద ప్రజలకు చాలా ఉపయోగకరంగా ఉంటుంది. ర్యాంకు తక్కువ వచ్చినా స్థానికులు కనుక సీట్ లభించే అవకాశం ఉంటుంది. విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం న్యాయం చేయాలి. లేకపోతే రాబోవు రోజుల్లో కూటమి ప్రభుత్వానికి గుణపాఠం తప్పదు.

– సుబ్బారెడ్డి, (వ్యాపారవేత్త), పులివెందుల



పేద విద్యార్థులకు అన్యాయం చేయొద్దు



రాష్ట్ర ప్రభుత్వం మెడికల్ సీట్ల విషయంపై పునరాలోచించి పేద విద్యార్థులకు న్యాయం జరిగేలా చూడాలి. ప్రైవేట్ భాగస్వామ్యంతో మెడికల్ సీట్లను భర్తీ చేయడం వల్ల పేద విద్యార్థులకు తీరని అన్యాయం జరిగే ప్రమాదం ఉంది. పులివెందుల మెడికల్ కాలేజీకి కేటాయించిన 50 మెడికల్ సీట్లను తాము నిర్వహించలేమని రాష్ట్ర ప్రభుత్వం చెప్పడం, వెనుకబడిన రాయలసీమ ప్రాంత విద్యార్థులకు అన్యాయం చేయడమే. ఇతర రాష్ట్రాలు మెడికల్ కాలేజీలు, సీట్లు అధికంగా కేటాయించాలని డిమాండ్ చేస్తుండగా కూటమి ప్రభుత్వం మాత్రం వద్దు అనడం విడ్డూరంగా ఉంది.

– వీరనాల శివకుమార్, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి

క్లుప్తంగా

సుప్రీం తీర్పును వ్యతిరేకిస్తున్నాం

కడప రూరల్ : ఎస్సీ వర్గీకరణ అంశంపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును వ్యతిరేకిస్తున్నామని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు గోళ్ల అరుణ్ కుమార్ అన్నారు. సోమవారం స్థానిక వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ తీర్పు రాజ్యాంగ విరుద్ధమన్నారు. ఈ తీర్పును రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు చంద్రబాబు నాయుడు, రేవంత్ రెడ్డి వ్యతిరేకించాలన్నారు. కార్యక్రమంలో రాయలసీమ కన్వీనర్ సునీత కుమారి, రాష్ట్ర కార్యదర్శి లక్ష్మయ్య, జిల్లా అధ్యక్షుడు నర్రా వెంకటసుబ్బయ్య, ప్రధాన కార్యదర్శి గోపాల్, రవి ప్రకాష్, రమణ, వసంత కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తపై దాడి



గాయాలతో చికిత్స పొందుతున్న ఆమోస్

జమ్మలమడుగు రూరల్ : దానవులపాడు గ్రామానికి చెందిన ఆమోస్ అనే వైఎస్సార్‌సీపీ కార్యకర్తపై ముగ్గురు వ్యక్తులు సోమవారం కర్రలతో దాడి చేశారు. బాధితుడి కథనం మేరకు.. ఎన్నికల సమయంలో గ్రామంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తగా పని చేశాడనే విషయాన్ని మనసులో ఉంచుకున్న కొందరు సోమవారం మంచి మాటలతో గ్రామం వెలుపలకు తీసుకెళ్లారు. ఆ తర్వాత డానియల్ అనే వ్యక్తితో పాటు మరో ఇద్దరు కలసి దాడి చేసినట్లు బాధితుడు వాపోయాడు. వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి చికిత్స పొంది అనంతరం పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపాడు.

ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ నూతన కమిటీ ఎన్నిక



పి. మల్లికార్జున, రీజినల్ ప్రెసిడెంట్



ఎస్. సుధాకర్, రీజినల్ సెక్రటరీ

కడప కార్పొరేషన్ : ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ నూతన రీజినల్ కమిటీని ఎన్నుకున్నట్లు ఆ యూనియన్ స్టేట్ జనరల్ సెక్రటరీ టి. అంజయ్య, డిస్కం ప్రెసిడెంట్ జయప్ప తెలిపారు. సోమవారం స్థానిక విశ్వేశ్వరయ్య కమ్యూనిటీ భవనంలో కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై నూతన కమిటీని ఎంపిక చేశారు. రీజినల్ ప్రెసిడెంట్‌గా పి. మల్లికార్జున, రీజినల్ సెక్రటరీగా ఎస్. సుధాకర్‌లను ఎన్నుకున్నారు. వారితోపాటు వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కె. వెంకటేష్, అడిషనల్ సెక్రటరీగా ఎం. రాజా, కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



చెట్టుకు వేలాడుతున్న రమేష్ మృతదేహం



ధర్నా చేస్తున్న బంధువులు, సీపీఐ నాయకులు

- పెట్రోలు బంకు సమీపంలో చెట్టుకు ఉరి
- హత్య చేశారని బంధువుల ఆందోళన

పోరుమామిళ్ల : మైదుకూరు రోడ్డులోని హెచ్‌పీ పెట్రోలు బంకులో పని చేస్తున్న లక్కినేని రమేష్ అలియాస్ జాన్(42) సోమవారం తెల్లవారుజామున బంకుకు ఎదురుగా ఉన్న చెట్టుకు ఉరి తాడుకు వేలాడుతూ కనిపించాడు. బంకులో పని చేస్తున్న మరో వ్యక్తి చెట్టుకు శవమై వేలాడుతూ కనిపించిన రమేష్‌ను చూడటంతో సమాచారం వెలుగు చూసింది. ఆర్‌అండ్‌బీ కార్యాలయం వెనుక వైపు (బంకుకు ఎదురుగా) ఉన్న చెట్టుకు రమేష్ తాడుకు వేలాడుతూ మృతి చెందిన విషయం తెలిసి తెల్లవారేలోపు బంధువులు అక్కడకు చేరుకున్నారు. అప్పటికే ఎస్ఐ, పోలీసులకు సమాచారం తెలిసి పరిశీలించారు.

మృతుడు రమేష్ ఈదుళ్లపల్లెకు చెందిన వాడైనా భార్య మరియమ్మ, కుమారునితో చల్లగిరిగెలలో ఉంటున్నారు. ఇతని ఒక్కగానొక్క కొడుకు అనారోగ్యంతో దశాబ్దకాలం పైగా మంచానికే పరిమితమయ్యాడు. రమేష్‌ను హత్య చేసి చెట్టుకు ఉరి వేశారని బంధువులు ఆందోళనకు దిగారు. మృతదేహాన్ని పోస్టుమార్టానికి పంపేందుకు ఎస్ఐ చేసిన ప్రయత్నాన్ని వారు అడ్డుకున్నారు. వారికి సీపీఐ నాయకులు అండగా నిలిచి బంకు వద్ద ధర్నాకు దిగారు. బంకు యజమాని రాజా శవం గురించి పట్టించుకోకుండా పెట్రోలు అమ్మకాలు చేసుకుంటున్నాడని, రమేష్ హత్యలో అతని ప్రమేయం ఉందని వారు ఆరోపించారు. రిపోర్టు ఇవ్వండి.. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తాం.. వాస్తవాలు తెలుస్తాయని ఎస్ఐ కొండారెడ్డి చెప్పిన మాటలను బంధువులు, సీపీఐ నాయకులు పట్టించుకోలేదు. రోడ్డుపై బైఠాయించి న్యాయం కావాలని డిమాండ్ చేశారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో అక్కడ జనం భారీగా గుమికూడారు.

శవాన్ని బంకు వద్దే ఉంచి మధ్యాహ్నానికి కూడా ఆందోళన కొనసాగిస్తుండటంతో సీఐ శ్రీనివాసులు రంగప్రవేశం చేసి, మృతుని బంధువులతో, బంకు యజమానితో మాట్లాడి రాజీ ప్రయత్నం చేసి ఆందోళన లేకుండా చేయగలిగారు. సాయంత్రం 4 గంటలకు శవాన్ని పోస్టుమార్టానికి తీసుకెళ్లేందుకు బంధువులు అంగీకరించారు. సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ కొండారెడ్డి మాట్లాడుతూ కేసు నమోదు చేస్తామని, హత్యగా తేలితే కేసును హత్యగా మారుస్తామని, ఆత్మహత్యగా తేలితే అదే నమోదు చేస్తామని చెప్పారు.

పెట్రోలు బంకులోని సీసీ కెమెరాల్లో రాత్రి 12–30 గంటల వరకు రమేష్ పని చేసినట్లు ఆ తరువాత రోడ్డుపైకి వెళ్లినట్లు రికార్డయింది. రోడ్డుపైకి వెళ్లిన రమేష్ ఎటుపోయాడో తెలియడం లేదు. మళ్లీ బంకులోకి రాలేదు. బంకులో నిద్ర పోతున్న మరో వర్కర్ తెల్లవారు జామున లేచి బయటకు వచ్చి చూసేటప్పటికి ఎదురుగా చెట్టుకు రమేష్ వేలాడుతూ కనిపించడంతో విషయం బయటకు తెలిసిందని చెబుతున్నారు. అయితే అర్ధరాత్రి నుండి తెల్లవారు జాము వరకు ఆయిల్ కోసం వాహనాలు రాలేదా? వచ్చినవారు హారన్ కొట్టి లేదా నేరుగా బంకు వద్దకు వచ్చి లోపలున్న వర్కర్‌ను లేపకుండా వెళ్లారా? వర్కర్ తెల్లవారుజాము దాకా నిద్రపోతూనే ఉన్నాడా? ఈ ప్రశ్నలకు సమాధానం రావాల్సి ఉంది. బంధువులు ఆరోపిస్తున్నట్లు ఇందులో యజమాని రాజా పాత్ర ఎంత వరకు అన్నది తేలాల్సి ఉంది. మెడకు తాడు బిగించి చంపి, అక్కడకు తెచ్చి చెట్టుకు వేలాడదీశారని వస్తున్న ఆరోపణలే నిజమైతే ఇందులో ఇద్దరు ముగ్గురి పాత్ర ఉండి ఉంటుంది. పోలీసుల విచారణలో వాస్తవాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.

అక్రమ గుడిసెల తొలగింపులో జాప్యం

ఆందోళనలో పట్టాలు పొందిన లబ్ధిదారులు



జగనన్న లేఅవుట్‌లో వేసిన అక్రమ గుడిసెలు

గోపవరం : మండలంలోని బేతాయపల్లె సచివాలయం పరిధిలోని పి.పి.కుంట జాతీయ రహదారి పక్కనే జగనన్న లేఅవుట్‌లో అక్రమంగా వేసిన గుడిసెల తొలగింపుపై సంబంధిత అధికారులు జాప్యం వహిస్తుండటంతో పట్టాలు పొందిన లబ్ధిదారులు ఆందోళనకు గురవుతున్నారు. ఇళ్లులేని అర్హులైన పేదలు స్థానిక సచివాలయంలో దరఖాస్తు చేసుకోగా గత ప్రభుత్వం జగనన్న లేఅవుట్లు కేటాయించి స్థలాలు ఇవ్వడంతో పాటు పక్కా గృహాలు కూడా నిర్మించి ఇచ్చింది. అందులో భాగంగా గోపవరం రెవెన్యూ పొలం–2 లో సర్వే నంబర్ 1562 లో పి.పి. జాతీయ రహదారి పక్కనే ప్రభుత్వ భూమిని జగనన్న లేఅవుట్‌కు కేటాయించారు. అందులో మొదటి విడతలో 12 మందికి ఇళ్లు మంజూరు కాగా అవి పూర్తి చేశారు. అంతేకాకుండా మరో 71 మందికి పట్టాలు ఇచ్చారు. ఇచ్చిన పట్టాలన్నింటికి సచివాలయంలో రిజిస్ట్రేషన్ ప్రక్రియ కూడా పూర్తయింది. ఇంతలో సీపీఐ ఆధ్వర్యంలో స్థానికేతరుల ద్వారా జగనన్న లేఅవుట్‌లో అక్రమ గుడిసెలు వేశారు. సకాలంలో వేసిన గుడిసెలను రెవెన్యూ అధికారులు తొలగించకపోవడంతో తాత్కాలిక గుడిసెల స్థానంలో కొందరు పక్కా ఇళ్లు నిర్మించుకుంటున్నారు. దీంతో పట్టాలు పొందిన లబ్ధిదారులు జూలై నెలలో జిల్లా కలెక్టర్‌కు ప్రజావేదిక ద్వారా వినతి పత్రం ఇచ్చారు. వినతిపత్రాన్ని పరిశీలించి స్థానిక రెవెన్యూ అధికారులకు గుడిసెలు తొలగించేందుకు ఆదేశాలు ఇచ్చారు. ఈ మేరకు తగినంత పోలీసు బందోబస్తు కావాలని గత నెల 27వ తేదీన జిల్లా ఎస్పీకి రాతపూర్వకంగా తెలియజేశారు. అయినా ఇప్పటి వరకు పోలీసు, రెవెన్యూ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. రోజురోజుకు అక్రమ గుడిసెలు వేసే వారి సంఖ్య పెరుగుతుండటమే కాకుండా పక్కా ఇళ్లు నిర్మించుకుంటుండటంతో పట్టాలు పొందిన తమ పరిస్థితి ఏమిటని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కార్మికుల హక్కుల కోసం పోరాటం చేయాలి



మాట్లాడుతున్న ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్

ప్రొద్దుటూరు : అనేక పరిశ్రమల్లో, ప్రభుత్వ సంక్షేమ పథకాల కార్మికులకు రక్షణ లేకుండా పోయిందని, కనీస వేతనాలు అందనంత దూరంలో వారు ఉన్నారని, వారి హక్కుల కోసం పోరాటాలకు సిద్ధం కావాలని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్ అన్నారు. స్థానిక ప్యారడైజ్ ఎస్‌డీఎస్ ఫంక్షన్ హాల్‌లో రెండో రోజు సోమవారం స్కీం వర్కర్ల రాష్ట్ర స్థాయి సైద్ధాంతిక శిక్షణ తరగతులు ముగిశాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను వ్యతిరేకిస్తున్నామన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ కోసం పోరాటాలు చేయాలన్నారు. అంగన్‌వాడీ, ఆశ, మధ్యాహ్న భోజన పథకం, స్కావెంజర్స్ తదితర స్కీం కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించి కనీస వేతనాలు ఇవ్వాలన్నారు. ప్రపంచీకరణ ఆర్థిక, సామాజిక రంగాల్లో పాత్ర అనే అంశంపై ఎం.వెంకయ్య, మహిళా చట్టాలు తీరుతెన్నులు అనే అంశంపై ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి రాజారెడ్డి, ఏఐటీయూసీ చరిత్ర ఉజ్వల ఘట్టాలు అనే అంశంపై ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.రవీంద్రనాథ్ బోధించారు. ఈ కార్యక్రమంలో స్కీం వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర నాయకులు లలితమ్మ, మంజుల, రమేష్ బాబు, స్రవంతి, సుభాషిణి, బాలకృష్ణ, శాంతి, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగసుబ్బారెడ్డి, జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్, చాంద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

గంజాయి స్మగ్లర్ల అరెస్టు



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ

పోరుమామిళ్ల : పోరుమామిళ్లలో సోమవారం ముగ్గురు గంజాయి స్మగ్లర్లను అరెస్టు చేసి వారి నుంచి 2 కేజీల గంజాయి, వెయ్యి రూపాయల నగదు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు. సోమవారం రాత్రి సీఐ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మైదుకూరుకు చెందిన ఆసిఫ్ అనే వ్యక్తి తూర్పుగోదావరి జిల్లాలో గంజాయి తెచ్చి హైదరాబాదులో అమ్మేవాడన్నారు. ఈ నేపథ్యంలో నల్గొండ పోలీసులకు చిక్కి జైలుకు వెళ్లాడన్నారు. జైలులో పవన్ అనే గంజాయి స్మగ్లర్‌తో పరిచయం ఏర్పడి బయటకు వచ్చాక గంజాయి అమ్మకం పెంచాడన్నారు. అనంతరం మైదుకూరు వచ్చి కడప, ప్రొద్దుటూరు, దువ్వూరు, బద్వేలు, కలసపాడు, పోరుమామిళ్లలో గంజాయి అమ్ముతున్నాడన్నారు. ఇతనిపై కడప, ప్రొద్దుటూరు, దువ్వూరులో కేసులున్నాయన్నారు. పోరుమామిళ్లలో ఉన్న అతని అవ్వగారింట్లో గంజాయి అమ్మేవాడన్నారు. సోమవారం సమాచారం అందుకున్న పోలీసులు రంపాడు రోడ్‌లో అతనితో పాటు కలసపాడుకు చెందిన వావిళ్ల వెంకటయ్య, పోరుమామిళ్ల కాపువీధికి చెందిన మహమ్మద్ గౌస్‌ను అరెస్టు చేశారు. పవన్ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. అతన్ని కూడా అరెస్టు చేస్తామని సీఐ చెప్పారు. సమావేశంలో ఎస్ఐ కొండారెడ్డి పాల్గొన్నారు.

అర్చకుడి భార్యపై దౌర్జన్యం

సుండుపల్లి: మండల కేంద్రంలోని శ్రీ విరూపాక్షేశ్వర దేవస్థానంలో అర్చకుడిగా విధులు నిర్వహిస్తున్న గడియారం సుబ్రమణ్యం స్వామి భార్యపై కొందరు దౌర్జన్యానికి పాల్పడ్డారు. బాధితురాలి కథనం మేరకు.. ఆలయ ప్రాంగణంలో పశుగ్రాసాన్ని పెంచుకొని గోసేవ చేస్తుండగా వ్యక్తిగత కారణాలతో సుండుపల్లి గ్రామానికి చెందిన కొందరు గోవులకు మేతను కూడా మిగల్చకుండా అక్రమంగా పశు గ్రాసాన్ని దున్నేశారు. ఆలయ అర్చకుడు సుబ్రమణ్యం భార్య వారిని ప్రశ్నించేందుకు ప్రయత్నించగా ఆమెపై దౌర్జన్యానికి పాల్పడ్డారు. ఈ సంఘటనపై సుండుపల్లె పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితురాలు తెలిపారు.

ఇద్దరు ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : మదనపల్లె మండలం కోళ్లబైలు పంచాయతీ వెలుగుస్కూల్ ప్రాంతానికి చెందిన రాజారెడ్డి కుమారుడు జి.మధుకర్‌రెడ్డి(40) ప్రైవేట్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. కుటుంబ సమస్యలతో సోమవారం ఇంటివద్దే పురుగు మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

భర్తతో గొడవపడి: రామసముద్రం మండలం కుదురుచీమనపల్లెకు చెందిన ఆటోడ్రైవర్ జబ్బార్ భార్య ఆయేషా(30) భర్త ప్రతిరోజు మద్యం సేవించి ఇంటికి వస్తుండటంతో సోమవారం గొడవ పడింది. భర్త ఆమెపై చేయి చేసుకోగా మనస్తాపంతో ఇంట్లోనే పురుగు మందు తాగింది.

కె.కె.కొట్టాల వద్ద వ్యర్థాల పైపులైన్ లీకేజీ

- లీకేజీ పనులను అడ్డుకున్న కె.కె.కొట్టాల గ్రామస్తులు
- శుద్ధి ప్లాంటును నిలిపి వేసిన యురేనియం అధికారులు



లీకేజీ పనులను అడ్డుకుంటున్న గ్రామస్తులు

వేముల : మండలంలోని కె.కె.కొట్టాల వద్ద యురేనియం వ్యర్థాలు పొలాలపై వెళ్లాయి. దీంతో గ్రామస్తులు గ్రామాన్ని, పొలాలు తీసుకుని పరిహారం ఇవ్వాలని ఆందోళనకు దిగారు. పైపులైన్ లీకేజీ పనులను అడ్డుకున్నారు. కాగా యురేనియం ప్రాజెక్టులో యురేనియం ముడి పదార్థాన్ని శుద్ధి చేయగా వచ్చే వ్యర్థాలను పైపులైన్ ద్వారా కె.కె.కొట్టాల సమీపంలోని టెయిలింగ్‌కు తరలిస్తున్నారు. సోమవారం వ్యర్థాలను తరలించే పైపులైన్ టెయిలింగ్ పాండ్ సమీపంలో లీకై న వ్యర్థ పదార్థం సమీపంలోని పొలాలపై పారింది. పంటలు సాగులో ఉన్నప్పుడు పైపులైన్ లీకై వ్యర్థ పదార్థాలు పొలాలపై ప్రవహిస్తే పరిస్థితి ఏమిటని అధికారులపై గ్రామస్తులు మండిపడ్డారు. ఇలాంటి సంఘటనలు తరుచూ జరుగుతున్నా పట్టించుకోలేదని యురేనియం అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పైపులైన్ లీకేజీని సరి చేసేందుకు వచ్చిన వారిని అడ్డుకుని వెనక్కి పంపించివేశారు. దీంతో గ్రామస్తుల ఆందోళనతో యురేనియం శుద్ధి చేసే కర్మాగారాన్ని నిలిపివేశారు. పులివెందుల డీఎస్పీ మురళీ నాయక్, సీఐ నాగరాజు, ఎస్ఐ ప్రవీణ్ కుమార్‌లు రంగ ప్రవేశం చేసి ఆందోళన చేస్తున్న కె.కె.కొట్టాల గ్రామస్తులతో చర్చించారు. మీ సమస్యలపై మంగళవారం పులివెందులలో చర్చిద్దామని డీఎస్పీ మురళీ నాయక్ గ్రామస్తులకు నచ్చజెప్పారు. దీంతో గ్రామస్తులు పైపులైన్ లీకేజీ పనులు చేసుకునేందుకు అంగీకరించారు.

మేము పెద్దాయన మనుషులం

ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నందుకు పోలీసులను బెదిరించిన ఎమ్మెల్యే వరద వర్గీయులు



ఇసుక అక్రమ రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను పరిశీలిస్తున్న పోలీసు

ప్రొద్దుటూరు : మండల పరిధిలోని రామాపురం గ్రామం వద్ద ఉన్న పెన్నానది నది నుంచి ఇసుక అక్రమ రవాణా చేస్తున్న విషయం పోలీసుల దృష్టికి వచ్చింది. రూరల్ ఎస్ఐ సురేష్ తన సిబ్బందితో కలసి సోమవారం సాయంత్రం దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇసుక లోడుతో ఉన్న ఆరు ట్రాక్టర్లు పోలీసుల కంటపడ్డాయి. దీంతో ట్రాక్టర్ల యజమానులు మేము పెద్దాయన మనుషులమని, తమను పట్టుకోవద్దని (ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి వర్గీయులు) పోలీసులను బెదిరించారు. దీంతో పోలీసులు వెనక్కి వచ్చారు. అనంతరం ట్రాక్టర్ల యజమానులు యధావిధిగా ఇసుకను తీసుకెళ్లి తిరిగి ఖాళీ ట్రాక్టర్లను అక్కడే ఉంచారు. ఇసుక అక్రమ రవాణాను పట్టుకోకుండా ఉండేందుకు టీడీపీ వర్గీయులు ఏకంగా ట్రాక్టర్లకు పసుపు పచ్చ రంగు వేశారు. ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చిన రోజు నుంచి రామాపురం గ్రామంలో యథావిధిగా ఇసుక అక్రమ రవాణా సాగుతోంది. ఈ విషయంపై రూరల్ ఎస్ఐ సురేష్‌ను వివరణ కోరగా సోమవారం సాయంత్రం జరిగిన ఇసుక అక్రమ రవాణాకు సంబంధించి ఒకరిపై కేసు నమోదు చేశామని తెలిపారు. ఆరు ట్రాక్టర్లలో ఇసుక ఉన్నా ఒకరిపైనే కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చెప్పడం గమనార్హం.

కడప-చెన్నై రహదారిపై లారీ దగ్ధం



మాధవరం-1 గ్రామ సమీపంలో దగ్ధం అవుతున్న ఇసుక లారీ

సిద్దవటం : సిద్దవటం మండలంలోని మాధవరం–1 గ్రామ శివారులో ఉన్న ఇండేన్ గ్యాస్ గోడౌన్ సమీపంలో కడప- చెన్నై రహదారిపై సోమవారం సిలికా ఇసుక లారీ దగ్ధమైంది. వివరాలు ఇలా ఉన్నాయి. ముద్దనూరు నుంచి ఇసుక నింపుకొని లారీ చెన్నైకి బయలుదేరింది. లారీ సిద్దవటం మండలంలోని ఇండేన్ గ్యాస్ గోడౌన్ సమీపంలోకి రాగానే లారీ ఇంజిన్‌లో మంటలు వ్యాపించడంతో డ్రైవర్ ప్రసాద్ అప్రమత్తమై లారీని రోడ్డు పక్కన ఆపేసి దిగేశాడు. దీంతో మంటల్లో లారీ దగ్ధం అవుతోందని సమాచారం తెలుసుకున్న ఒంటిమిట్ట సీఐ కృష్ణంరాజు నాయక్, సిద్దవటం ఎస్ఐ చిరంజీవి తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకున్నారు. వాహనాల రాకపోకలు స్తంభించడంతో వాహనాలు రోడ్డుకు ఇరువైపులా బారులు తీరాయి. కడపలోని అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి మంటలను ఆర్పేశారు. పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించి వాహనాల రాకపోకలు యథావిధిగా కొనసాగించారు. ఈ మేరకు లారీ డ్రైవర్‌ను విచారించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మా భూమిని ఆక్రమించాలని చూస్తున్నారు

వృద్ధ రైతు దంపతుల ఆవేదన



వృద్ధ రైతు దంపతులు సుబ్బమ్మ, పోలయ్య

పోరుమామిళ్ల : ప్రభుత్వం తమకు ఇచ్చిన డీకేటీ పట్టా భూమిని ఆక్రమించేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని వృద్ధ దంపతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సోమవారం పోరుమామిళ్లలో వారు విలేకరులకు వివరాలు తెలిపారు.పుల్లివీడు పంచాయతీ పేరమ్మగారిపల్లెకు చెందిన కోనేటి సుబ్బమ్మ, పోలయ్య దంపతులకు 20 ఏళ్ల క్రితం ప్రభుత్వం 2.44 సెంట్ల భూమి డీకేటీ పట్టాగా ఇచ్చింది. వారి పొలం పక్కన కలసపాడు మండలం జాతివర్తిపల్లెకు చెందిన మాజీ సైనికుడికి పట్టా ఇచ్చారు. ఆ పొలాన్ని ఆయన భార్య మార్తమ్మ సాగు చేసుకుంటూ వృద్ధ దంపతుల పొలం ఆక్రమించుకొనేందుకు ప్రయత్నిస్తోంది. భూమి సాగు చేసి పైరు పెడితే పైరు పెరిగాక రాత్రి సమయంలో ట్రాక్టర్‌తో దున్నేస్తున్నారని వారు కన్నీరు మున్నీరవుతున్నారు. దీనిపై రెవిన్యూ అధికారులకు, పోలీసులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదన్నారు. తమ పట్టా, పాసుబుక్కు, పరిశీలించి, తమ భూమిని సర్వేచేసి న్యాయం చేయాలని వారు కోరుతున్నారు.

రోడ్డు రిపేరులో ఉన్నా టోల్ వసూల్



మైదుకూరు-బద్వేల్ రహదారిలో బస్వాపురం దగ్గర ఉన్న టోల్‌ప్లాజా



నిర్మాణంలో ఉన్న నాలుగు వరుసల రోడ్డు

మైదుకూరు- బద్వేలు రోడ్డులోని టోల్ ప్లాజా నిర్వాహకుల నిర్వాకం

బ్రహ్మంగారిమఠం : కేంద్ర ప్రభుత్వం చెప్పేది ఒకటి ఆచరించేది మరొకటిగా కన్పిస్తోంది. అస్సలు టోల్ ఎందుకు వసూలు చేస్తారు అంటే నేషనల్ హైవే అథారిటీ ప్రకారం వాహనదారులకు రెండు వరుసలు లేదా నాలుగు వరుసలు నూతనంగా రోడ్డు ఏర్పాటు చేసినప్పుడు అందుకు అయిన ఖర్చులను తిరిగి వసూలుకు టోల్ వసూలు చేస్తారు. మైదుకూరు - బద్వేల్ రహదారిని ఎక్స్‌ప్రెస్ హైవేగా మార్చిన తర్వాత బస్వాపురం దగ్గర దాదాపు 8ఏళ్లుగా టోల్ ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి ప్రైవేటు సంస్థలు టెండర్ ద్వారా దక్కించుకొని వసూలు చేస్తున్నాయి. ఏడాది క్రితం మైదుకూరు–బద్వేల్ రోడ్డును నాలుగు వరుసల రోడ్డుగా కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేయగా రూ. 400 కోట్లతో ఎంపీ సీఎం రమేష్‌కు చెందిన రిత్విక్ కంపెనీ దక్కించుకొని పనులు చేపట్టారు. రోడ్డు నిర్మాణంలో ఉన్నా బస్వాపురం దగ్గర ఉన్న టోల్‌ప్లాజా మాత్రం వాహనదారుల నుంచి టోల్ వసూలు చేస్తుండటంతో వాహనదారులు విస్మయం చెందుతున్నారు. రోడ్డు రిపేరులో ఉన్నందువలన వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నా పట్టించుకొనే నాథుడు లేడు. రోడ్డు సరిగాలేకున్నా టోల్ ఎందుకు వసూలు చేస్తున్నారు అని వాహనదారుడు టోల్ సిబ్బందిని అడిగితే మేము టెండర్ వేశాం.. మా టైం ఇంకా ఉంది అందుకు వసూలు చేస్తున్నాం అని సమాధానం ఇవ్వడం తప్పా. రోడ్డు దుస్థితిపై మాత్రం పరిశీలించడం లేదు. అది ఏమి అని అడిగితే కేవలం 500 మీటర్లు రోడ్డు బాగుంటే చాలు టోల్ వసూలు చేయొచ్చు అంటున్నారు. ఇప్పటికై నా హైవే అథారిటీ అధికారులు వాహనదారుల అవస్థలు గుర్తించి బస్వాపురం దగ్గర ఉన్న టోల్‌ప్లాజా వద్ద వసూళ్లు నిలుపుదల చేయాలని వాహనదారులు కోరుతున్నారు.